

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో వినతిపత్రాలతో నిరసన తెలుపుతున్న దళితబంధు రెండో విడత అందని లబ్ధిదారులు

దళితుల నిర్బంధం

- హైదరాబాద్‌కు వెళ్లకుండా దళితబంధు సాధనకమిటీ నాయకుల ముందస్తు అరెస్ట్
- హుజూరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి లబ్ధిదారుల వినతి

వీణవంక/ జమ్మికుంట/ హుజూరాబాద్‌టౌన్, మే 24 : దళితబంధు సాధన కమిటీ పిలుపు మేరకు రెండో విడత నిధులు ఇవ్వాలని హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న దళితబంధు సాధన కమిటీ సభ్యులను శనివారం వీణవంక, జమ్మికుంట, హుజూరాబాద్‌లో పోలీసులు నిర్బంధించారు. హుజూరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నారనే సమాచారంతో చెల్పూర్‌కు చెందిన ఆకినపల్లి ఆకాశ్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. వీణవంక, జమ్మికుంటలో అరెస్ట్ అయిన వారిలో దళితబంధు సాధన కమిటీ ఇన్‌చార్జిలు కొలుగూరి నరేశ్, మంద రాజేశ్, బండారి ప్రశాంత్, మహంకాళి రమేశ్, సాగంటి స్వామి, ఊట్ల సంపత్, పుల్లూరి సంపత్, దాసారపు నాగరాజు ఉన్నారు. దళితబంధు రెండో విడత నిధులు వెంటనే విడుదల చేయాలని హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. దళితబంధు సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ.. నిధుల మంజూరులో రూ.5 లక్షలు పెండింగ్‌లో ఉన్నవారికి మొదట విడుదల చేయాలని కోరారు. రూ.వెయ్యి నుంచి రూ.లక్ష వరకు పెండింగ్‌లో ఉన్న వాళ్లకు మొదటగా మంజూరు చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అప్పులు కట్టేందుకు తిప్పలు పడ్తున్నం

దళితబంధు పథకం కింద వచ్చిన డబ్బులతో కంగన్‌హాల్ వ్యాపారం పెట్టుకున్నా. మొదటి విడత నిధులతో అరకొర సామాన్లే వచ్చినయ్. రెండో విడత నిధులు అందుతాయనే ఆశతో అదనంగా అప్పులు తెచ్చి వ్యాపారం సాగిస్తున్నా. పథకం అర్థాంతరంగా ఆగిపోవడంతో అప్పులు కట్టేందుకు గోసపడ్తున్నం. ప్రభుత్వం స్పందించకుంటే పార్టీ నాయకుల ఇండ్ల ముందు వంటావార్పు, ముట్టడి కార్యక్రమాలు చేస్తాం.

– కే కోమల, ఇల్లందకుంట

తెల్లవారుజామునే రైతుల అరెస్టు

- ఉమామహేశ్వర ప్రాజెక్టు వద్దన్న 15మందిపై పోలీస్ నిర్బంధం
- వారిని విడుదల చేయాలని ఆందోళన
- బల్మూరులో నాలుగు గ్రామాల భూనిర్వాసితుల రాస్తారోకో
- మూడు గంటల ఆలస్యంగా సదస్సు
- డిమాండ్లకు స్పందన లేకపోవడంతో నేలపై కూర్చొని నిరసన తెలిపిన అన్నదాతలు

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరులో నిరసన తెలుపుతున్న రైతులు, గ్రామస్థులు

బల్మూరు, మే 24 : ఉమామహేశ్వర ప్రాజెక్టు తమకు వద్దన్నందుకు రైతులపై పోలీస్ నిర్బంధం కొనసాగింది. శనివారం తెల్లవారుజామునే బల్మూరు, అనంతవరం, మైలారం, అంబగిరి గ్రామాలకు చెందిన 15 మంది భూనిర్వాసితులను అదుపులోకి తీసుకొన్నారు. పోలీస్ వాహనంలో వీరిని నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలియడంతో నాలుగు గ్రామాలకు చెందిన 400మంది రైతులు బల్మూరు మండల కేంద్రానికి చేరుకొని ఆందోళనకు దిగారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూములను కోల్పోయే ఉమామహేశ్వర ప్రాజెక్టు తమకు వద్దంటూ నిరసనకు దిగారు. భూములు పోతే తాము ఎలా బతకాలని ఆవేదన చెందారు. అచ్చంపేట సీఐ రవీందర్, బల్మూరు ఎస్సై రమాదేవి, పోలీసులు రైతుల వద్దకు వెళ్లి నచ్చజెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంపై అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు రైతులంతా శాంతియుతంగా రావాలని కోరారు. దీనికి వారు నిరాకరించారు. రోడ్డుపై ఆందోళన చేపట్టవద్దంటూ పోలీసులు సూచించడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన సదస్సుకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారన్న విషయం తెలుసుకొని రైతులు మళ్లీ రోడ్డుపైకి వచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అరెస్టయిన రైతులను పోలీసులు విడుదల చేసి బల్మూరుకు తీసుకొచ్చారు. గుమిగూడిన రైతలంతా ర్యాలీగా సదస్సు వద్దకు వెళ్లి డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులకు అందజేశారు. కుర్చీలు వేసినా రైతులెవరూ వాటిలో కూర్చోలేదు. ఉమామహేశ్వర ప్రాజెక్టును వెంటనే ఆపాలని, రుసూల్, మైలారం చెరువులను ఒక్క టీఎంసీ రిజర్వాయర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ఎకరాకు పరిహారంగా రూ.30 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. కానీ సమావేశం ప్రారంభమయ్యాక.. వీరి డిమాండ్లపై స్పందించి చదివి వినిపించకపోవడంతో రైతులు ఆగ్రహం చెందారు. దాదాపు 300 మంది అక్కడి నుంచి అసహనంతో వెళ్లిపోగా.. మిగిలిన కొందరితోనే సమావేశాన్ని కొనసాగించారు.

మూడు గంటలు ఆలస్యంగా సదస్సు..

ఉమామహేశ్వర ప్రాజెక్టుపై నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరులో నిర్వహించిన అవగాహన సదస్సు మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలైంది. దీంతో అధికారుల తీరుపై రైతులు మండిపడ్డారు. అంతవరకు రైతులెవరూ సదస్సుకు రాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. తర్వాత సదస్సు వద్దకు రైతులు వచ్చినా కుర్చీల్లో కూర్చోలేదు.

ఉమామహేశ్వర ప్రాజెక్ట్ నిర్మించి తీరుతాం

- పరిహారం విషయం సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్తా
- భూములిస్తే అవుట్‌సోర్సు, కాంట్రాక్ట్ ఉద్యోగాలిప్పిస్తా
- అవగాహన సదస్సులో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూరు, మే 24 : ఆరు నూరైనా ఉమామహేశ్వర ప్రాజెక్ట్‌ను నిర్మించి కృష్ణా నీటిని పారిచ్చి రైతుల పాదాలు కడుగుతామని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరులో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో భూసేకరణపై ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ అరుణారెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ స్టేజ్-1 ద్వారా రైతుల నుంచి భూసేకరణ కోసం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణంతో కొన్ని గ్రామాల రైతులు, ప్రజలకు నష్టం జరగడం ఖాయమని అన్నారు. కానీ ఐదు మండలాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు అనంతవరం, బల్మూరులో ఒక్క ఇల్లు కూడా పోకుండా గ్రామాలకు 350, 370 మీటర్లు దూరంగా డిజైన్ మార్పు చేసినట్టు చెప్పారు. రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు అడ్డుపడి అభివృద్ధికి ఆటంకం కలిగించొద్దని సూచించారు.

తీర్పు అమలు చేయకుంటే కోర్టు ధిక్కరణ చర్యలు

నల్లగొండ జిల్లా పూర్వపు కలెక్టర్‌కు హైకోర్టు హెచ్చరిక

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా పూర్వపు కలెక్టర్ సీ నారాయణరెడ్డి (ప్రస్తుతం రంగారెడ్డి కలెక్టర్)పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నల్లగొండ డీఆర్‌డీఏ సిబ్బందికి కనీస వేతన స్కేల్ అమలు చేయాలంటూ నిరుడు జారీచేసిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని ఆయనను ప్రశ్నించింది. ఆ ఆదేశాల్లో సుప్రీంకోర్టు ఉత్తర్వులను కూడా ప్రస్తావించామని, అయినప్పటికీ పిటిషనర్ల వినతిపత్రాలను ఏకపక్షంగా ఎలా తిరస్కరిస్తారని నిలదీసింది. ఆ ఆదేశాలను 4 వారాల్లోగా అమలు చేయకుంటే కోర్టుధిక్కార చర్యలు తప్పవని హెచ్చరించింది. విరాల్లోకి వెళ్తే.. తమకు వేతన పేస్కేల్‌తోపాటు ఇంక్రిమెంట్ అమలు చేయాలని కోరుతూ నల్లగొండ జిల్లా డీఆర్‌డీఏ ఆఫీస్ సబార్డినేట్ కలమ్మ మరో ఇద్దరు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై నిరుడు హైకోర్టు విచారణ జరిపింది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పిటిషనర్లకు తగిన ఉపశమనం కల్పించాలని నిరుడు ఏప్రిల్ 2న తీర్పు చెప్పింది. కానీ, పిటిషనర్లు తాత్కాలిక ఉద్యోగులని, వారు పేస్కేల్, ఇంక్రిమెంట్‌కు అర్హులు కారని కలెక్టర్ నిరుడు ఆగస్టులో జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై పిటిషనర్లు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ మాధవి దేవి.. కలెక్టర్ చర్యను తప్పుపట్టారు. 4 వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

- ఖాళీబిందెలతో మహిళల నిరసన

తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ శనివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బుర్దగూడలోని మహిళలు ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. నెలరోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని, నీటికోసం అరిగోస పడుతున్నామని ఆవేదన చెందారు. –కాగజ్‌నగర్ రూరల్

రైతుల కన్నా.. అందాల పోటీలే ఎక్కువా?

- అన్నదాతలను పట్టించుకోని సర్కార్
- వర్షాలతో గోసపడుతున్న కర్షకులు
- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- మాజీ మంత్రి వేముల డిమాండ్

మోర్తాడ్, మే 24: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాల కన్నా, అందాల పోటీలు ఎక్కువయ్యాయని ఎద్దేవా చేశారు. ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్ష నిర్వహించడానికి కూడా సమయం లేని ముఖ్యమంత్రి అందాల పోటీల విషయంలో ఎనిమిదిసార్లు సమీక్ష నిర్వహించినట్టు విమర్శించారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా, అవన్నీ ఉట్టిమాటలేనని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇంకా కల్లాల వద్ద, రహదారులపై ధాన్యపు రాశులు కుప్పలుకుప్పలుగా పడి ఉన్నాయని, ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నట్టు తెలిపారు. కల్లాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం కూడా రైస్ మిల్లులకు తరలించడానికి సకాలంలో లారీలను ప్రభుత్వం పంపకపోవడంతో ధాన్యం నీటిపాలవుతున్నదని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మిల్లుల వద్ద తరుగు తీస్తూ రైతులకు తీవ్రనష్టం కల్గిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు.

- కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తిన ధాన్యం

కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం మొలకెత్తిందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కామోల్, కుంసర, వానల్‌పాడ్ గ్రామాల రైతులు కామోల్ కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలించారు. సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి తడిసి మొలకలు వచ్చాయని శనివారం కొనుగోలు కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. – భైంసా టౌన్

ఈర్లపల్లితండాలో నకిలీ విత్తనాలు పట్టివేత

జడ్చర్ల టౌన్, మే 24 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఈర్లపల్లి తండాలోని రెండు ఇండ్లల్లో 50 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్టు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్ తెలిపారు. శనివారం ఆయన జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ కమలాకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈర్లపల్లి తండాకు చెందిన మేఘావత్ చంద్య ఇంట్లో 35 కిలోలు, అతడి కుమారుడు మేఘావత్ రవి ఇంట్లో 15 కిలోల నకిలీ పత్తివిత్తనాలు లభించినట్టు తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకొని ఇద్దరినీ పోలీసులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో అధికారులు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

కుమ్రంభీం ఆసిఫాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి సదాశివ నకిలీ బీటీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్టు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు కాగజ్‌నగర్ రూరల్ పోలీస్టేషన్ పరిధిలో పెద్ద వాగు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఐచర్ వాహనాన్ని సోదా చేయగా సుమారు రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ బీటీ- 3 విత్తనాలు లభించాయి. సదాశివతోపాటు కర్నూల్‌కు చెందిన డ్రైవర్ పుప్పాల లక్ష్మణ్, మహారాష్ట్రలోని అహేరికి చెందిన సంతోష్‌కిశోర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన వేణుగోపాల్ రెడ్డి పరారీలో ఉన్నట్టు ఎస్పీ తెలిపారు.

మహబూబాబాద్ జిల్లా మంగిమడుగులో వర్షానికి తడిసి మొలకెత్తుతున్న ధాన్యం బస్తాలు

తడిసిన ధాన్యం కొనాలని రోడ్డెక్కిన రైతులు

కేంద్రాల్లో వడ్లు మొలకెత్తుతున్నాయని ఆవేదన • మహబూబాబాద్ జిల్లా ముంగిమడుగులో ధర్నా

తొర్రూరు/నర్సింహులపేట, మే 24 : తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం ముంగిమడుగులో రైతులు ధర్నాకు దిగారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యంతో నర్సింహులపేట మండలం నర్సింహులపేట, ముంగిమడుగు, వంతడుపుల, పెద్దనాగారంలో కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతున్నదని వారు తెలిపారు. వర్షాలకు మొలకెత్తిన వడ్లను చూపిస్తూ కన్నీరు పెట్టుకున్నారు. తాము 45 రోజుల క్రితం కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చినా.. ఇప్పటివరకు కాంటా పెట్టలేదని తొర్రూరు మండలం ఫతేపురం గ్రామానికి చెందిన నిమ్మల రామ్మూర్తి, కొండ అశోక్ ఆవేదన వ్యక్తంచేశారు. తడిసిన ధాన్యాన్ని ఎండబెడితేనే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్తున్నారని వారు మండిపడ్డారు. తక్షణమే స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశఋూరు.

ముంగిమడుగులో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధర్నా చేస్తున్న రైతులు

బస్తాలు తడిసి మొలకలు వచ్చినయ్

నేను నెల కింద ముంగిమడుగు ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సన్నవడ్లు పోసిన. నాతోపాటు చాలామంది రైతులు సెంటర్‌లో పోసిన్రు. నిర్వాహకులు తూకం వేసి బస్తాలు నిల్వ ఉంచింర్రు. అకాల వర్షాలతో ఇప్పటికే మూడుసార్లు వడ్ల బస్తాలు తడిశాయి. దీంతో 119బస్తాల్లో కింది భాగంలో ఉన్న వడ్లు బస్తాల నుంచి మొలకెత్తుతున్నాయి. కలెక్టర్ సారు.. ఇప్పటికైనా స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేసి మొలకెత్తుతున్న ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించేలా చూడాలి.

– మంద నరేందర్‌రెడ్డి, రైతు, రామన్నగూడెం, నర్సింహులపేట మండలం,

తడిసిన ధాన్యం.. ఆందోళనలో అన్నదాత

గంగాధర/వేములవాడ రూరల్/ రుద్రంగి/ బోయినపల్లి రూరల్, మే 24: కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. కేంద్రాల్లో వడ్లు పోసి నెలదాటినా ఎప్పుడు కొంటారో తెలియక ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం, సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రూరల్, గంభీరావుపేట, రుద్రంగి, బోయినపల్లి మండలాల్లో వర్షం కురవగా కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసిపోయింది. బోయినపల్లి మండలం మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించారు. ధాన్యం సేకరణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అకాల వర్షాలతో వడ్లు తడిసినా సర్కారుకు పట్టింపులేదని మండిపడ్డారు.

కరీంనగర్ జిల్లా కోట్లనర్సింహులపల్లిలో మొలకెత్తిన ధాన్యాన్ని చూస్తున్న లక్ష్మి

నారాయణపేట జిల్లా సింగారం గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కొడంగల్ లిఫ్ట్‌కు భూములియ్యం

- అధికారులకు తేల్చిచెప్పిన రైతులు
- చేసేదేమి లేక సింగారం గ్రామసభ నుంచి వెనుదిరిగిన అధికారులు

నారాయణపేట రూరల్, మే 24 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణానికి తమ భూములిచ్చేది లేదని రైతులు తేల్చిచెప్పారు. శనివారం నారాయణపేట జిల్లా సింగారంలో నిర్వహించిన గ్రామసభకు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో రాంచందర్ హాజరయ్యారు. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయే వారి పేర్లను గ్రామసభలో అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు.. అధికారులకు తమ గోడువెల్లబోసుకున్నారు. భూములు కోల్పోయే వారంతా చిన్న, సన్నకారు రైతులేనని, వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నామని తెలిపారు. భూములు కోల్పోతే బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన చెందారు. 'ఇదే విషయాన్ని గతంలో వచ్చిన అధికారులకు సైతం చెప్పాం.. ఇప్పుడు మళ్లా మీరొచ్చారు.. మా బాధలు ఎవరికి చెప్పాలో అర్థం కావడంలేదు' అని వాపోయారు. భూముల విషయంలో మరోసారి ఆలోచించాలని అధికారులను కోరారు. భూములైతే ప్రాజెక్టుకు ఇవ్వబోమని చెప్పడంతో చేసేది లేక అధికారులు వెనుదిరిగారు. అంతకుముందు అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కొడంగల్ లిఫ్ట్‌తో లక్షా నలభై వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. భూత్పూరు రిజర్వాయర్ నుంచి ఊట్కూరు పెద్ద చెరువు, పేరపళ్ల జాయమ్మ చెరువులకు నీటిని తరలించి పంప్ హౌస్‌ల ద్వారా ఓపెన్ కెనాల్ పైపులైన్ నిర్మాణంతో దౌల్తాబాద్, కొడంగల్ ప్రాంతాలకు సాగునీటిని అందించనున్నట్టు చెప్పారు.

- కొనుగోలులో జాప్యంపై రైతుల ఆగ్రహం

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి నెలదాటినా కాంటా పెట్టడం లేదంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. అకాల వర్షాలతో తడిసి మొలకొచ్చిన ధాన్యంతో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో రైతులు రెండు గంటలపాటు ధర్నా చేశారు. కొత్తపల్లి కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకువచ్చి నెలదాటినా కాంటా పెట్టే పరిస్థితులు లేవని మండిపడ్డారు. అధికారుల అలసత్వంతో ధాన్యం తరుగుపోవడంతోపాటు అకాల వర్షానికి వడ్లు తడిసి అడుగుభాగంలో మొలకలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. – గంభీరావుపేట

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

భిక్కనూర్‌లో రైతుల రాస్తారోకో

- తడిసిన ధాన్యం కొనాలని డిమాండ్
- రోడ్డుపై ధాన్యం పోసి నిరసన

భిక్కనూరు, మే 24: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండల కేంద్రంలో శనివారం సాయంత్రం రైతులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై తడిసిన ధాన్యాన్ని పోసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట కోసి 20రోజులైనా ధాన్యాన్ని తూకం వేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షాలకు తడవడంతో వడ్లకు మొలకలు వస్తున్నాయని ఆవేదన చెందారు.

బలవంతంగా భూములు గుంజుకుంటరా?

- రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి కండ్లమంటెందుకు?
- డిమాండ్లను నెరవేర్చాకే ఎత్తిపోతల పనులు చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరిక

మక్తల్, మే 24 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ బలవంతంగా భూములను గుంజుకోవాలని చూస్తే సహించే దిలేదని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లికి చెందిన రైతులు శనివారం చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఇదివరకే భూత్పూర్ రిజర్వాయర్‌లో 300 ఎకరాలను కోల్పోయామని, మళ్లీ నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పేరిట మరో 90 ఎకరాలు తీసుకుంటామంటే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తంచేశారు. భూములు కోల్పోతున్న రైతులకు సర్కారు, అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా ఇష్టానుసారంగా సర్వేలు చేస్తూ పోలీసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వమే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను లాక్కోవాలని చూడటం సరికాదన్నారు. పేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు అనుమతులు లేవని, అన్ని అనుమతులు వచ్చాకే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రాజెక్టు చేపడితే నిర్వాసిత రైతులకు న్యాయం చేయాల్సిందేనని, లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.